క్లుప్తంగా

డీసీసీ రేసులో మాజీ మేయర్


పారిజాతరెడ్డి

బడంగ్‌పేట్: కాంగ్రెస్ పార్టీ రంగారెడ్డి జిల్లా అధ్యక్ష ఎన్నిక కోసం ఏఐసీసీ నుంచి వచ్చిన బృందాలు ఆయా నియోజకవర్గాలు, మండలాల్లో ప్రత్యేక సమావేశాలు నిర్వహించి నాయకులు, కార్యకర్తల నుంచి అభిప్రాయాలు సేకరిస్తున్నారు. తాజాగా డీసీసీ రేసులో బడంగ్‌పేట్ కార్పొరేషన్ మాజీ మేయర్ చిగురింత పారిజాతరెడ్డి సైతం ఉన్నట్లు సమాచారం. ఇప్పటికే తన దరఖాస్తును కూడా ఏఐసీసీ పరిశీలించాలని కోరినట్లు తెలిసింది. మేయర్‌గా చేసిన అనుభవంతో పాటు నిజామాబాద్, వనపర్తి తదితర జిల్లాలకు ఎన్నికల పర్యవేక్షకురాలిగా పార్టీలో క్రియాశీలకంగా కొనసాగుతున్నారు.

నేడు కాంగ్రెస్ పార్టీ సమావేశం

తుక్కుగూడ: కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడి(డీసీసీ) ఎంపిక కోసం శనివారం తుక్కుగూడలో పార్టీ మహేశ్వరం నియోజకవర్గ సమావేశం నిర్వహిస్తారని మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్ పేర్కొన్నారు. ఈ సమావేశం మధ్యాహ్నం 3 గంటలకు తుక్కుగూడ పురపాలిక కేంద్రంలోని నిర్వహిస్తున్నామన్నారు. అభిప్రాయ సేకరణ కోసం పార్టీ నుంచి పెద్దలు రావడం జరుగుతుందన్నారు. పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో హాజరుకావాలని ఆయన సూచించారు.

సీపీఆర్‌పై అవగాహన


కందుకూరు చౌరస్తాలో సీపీఆర్‌పై అవగాహన కల్పిస్తున్న 108 సిబ్బంది

కందుకూరు: మండల కేంద్రంలో శుక్రవారం 108 అంబులెన్స్ సిబ్బంది ఆధ్వర్యంలో సీపీఆర్‌పై ప్రజలకు అవగాహన కల్పించారు. అనుకోకుండా గుండె కొట్టుకోవడం ఆగిపోతే ఆ మనిషి ప్రాణాన్ని ఎలా కాపాడాలి అనే విషయాలపై సిబ్బంది సురేందర్, యాదయ్య, షఫీ ప్రజలకు ప్రయోగాత్మకంగా చూపించారు. అలాంటి సందర్భాల్లో సీపీఆర్ చేయడంతో పాటు వెంటనే 108కు సమాచారం అందించాలని సూచించారు.

బంద్‌ను విజయవంతం చేయాలి

తుక్కుగూడ: బీసీ సంఘాల ఆధ్వర్యంలో తలపెట్టిన బంద్‌ను విజయవంతం చేయాలని బీసీ యువజన విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అనంతులు రామ్మూర్తి గౌడ్ పిలుపునిచ్చారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. బీసీల రిజర్వేషన్ల కోసం రాష్ట్ర వ్యాప్తంగా నేడు బంద్‌కు పిలుపునిచ్చారని చెప్పారు. పార్టీలు, కులాలకు అతీతంగా మద్దతు ఇవ్వాలన్నారు.

విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి


విద్యార్థులతో మాట్లాడుతున్న శ్రీనివాసాచారి

షాబాద్: ఉపాధ్యాయులు చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని తెలంగాణ మోడల్ స్కూల్ అదనపు సంచాలకులు శ్రీనివాసాచారి పేర్కొన్నారు. శుక్రవారం తెలంగాణ ఆదర్శ పాఠశాలను ఆయన సందర్శించి, ఉపాధ్యాయుల హాజరు పట్టికను పరిశీలించారు. అనంతరం మధ్యాహ్న భోజనం, లైబ్రరీ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డిజిటల్ తరగతులను విద్యార్థులకు బోధించే వారు ప్రతిభను పెంచేటట్లుగా కృషి చేయాలన్నారు. విద్యార్థుల బంగారు భవిష్యత్‌కు బాటలు వేయాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ రాఘవేందర్, ఏఎంఓ రవికుమార్ తదితరులున్నారు.

రాజ్‌భవన్‌కు తరలిన సీపీఎం శ్రేణులు

షాద్‌నగర్‌రూరల్: రాష్ట్రంలోని బీసీ కులాలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సీపీఎం డివిజన్ కార్యదర్శి రాజు డిమాండ్ చేశారు. శుక్రవారం సీపీఎం ఆధ్వర్యంలో నాయకులు రాజ్‌భవన్ ముట్టడికి తరలివెళ్లారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ.. బీసీ రిజర్వేషన్‌పై రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేసిన ఆర్డినెన్స్‌ను గవర్నర్ ఆమోదం తెలపాలన్నారు. అనంతరం నగరంలో రాజ్‌భవన్ ముట్టడికి వెళ్లిన నాయకులను పోలీసులు అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. వీరిలో నాయకులు తదితరులు ఉన్నారు.

ప్రమాదాల కూడలి

- సూచిక బోర్డులతో నిండిన మీర్‌పేట పోలీస్‌స్టేషన్‌కు వెళ్లే రహదారి
- వాహనాలు కనిపించక తీవ్ర అవస్థలు
- పట్టించుకోని అధికారులు


మీర్‌పేట పోలీస్‌స్టేషన్‌కు వెళ్లే ప్రధాన రహదారి

మీర్‌పేట: రహదారికి ఇరువైపులా ఏర్పాటు చేసిన సూచిక బోర్డులు వాహనదారులకు ప్రాణ సంకటంగా మారాయి. పక్కన నుంచి వచ్చే వాహనాలు కనిపించక తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఇదీ మీర్‌పేట్– అల్మాస్‌గూడ ప్రధాన రహదారి కూడలిలో నెలకొన్న పరిస్థితి. మీర్‌పేట పోలీస్‌స్టేషన్‌కు వెళ్లే కూడలి ప్రమాదాలకు నిలయంగా మారింది. రోడ్డుపైనే వ్యాపార సముదాయాల బోర్డులు ఏర్పాటు చేసుకోవడంతో స్టేషన్ లోపలి నుంచి వచ్చే వాహనాలు రహదారిపైకి వచ్చేంత వరకు కనిపించకపోవడంతో నిత్యం కూడలిలో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. దీనికి తోడు ఈ కూడలిలో రోడ్డు పూర్తి స్థాయిలో ధ్వంసం కావడంతో వేగంగా వచ్చే వాహనదారులు ఇక్కడికి రాగానే అదుపు చేయలేక కిందపడి గాయపడిన సంఘటనలు తరచూ జరుగుతున్నాయి. ప్రధానంగా రహదారి అభివృద్ధిలో నాణ్యత ప్రమాణాలు పాటించకపోవడంతో కూడలి తరచూ ధ్వంసమవుతుందని, మూడు నెలలకు ఒకసారి మరమ్మతులు చేపట్టడం ఆ తరువాత మరలా పాడైపోవడం సర్వసాధారణమని వాహనదారులు వాపోతున్నారు.


గాయపడిన వృద్ధురాలికి సహాయం చేస్తున్న స్థానికులు (ఫైల్)

“స్పీడ్ బ్రేకర్లు వేయండి



వాహనాల వేగాన్ని తగ్గించేందుకు, కూడలిలో రోడ్డు ప్రమాదాలను నివారించాలంటే స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలి. పోలీస్‌స్టేషన్ లోపలి నుంచి వచ్చే వాహనాలు కనిపించక, రోడ్డు ధ్వంసమై ఉండడం, ఇక్కడే వాహనాలు మలుపు తీసుకోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. తాజాగా ద్విచక్ర వాహనం అదుపుతప్పి ఓ వృద్ధురాలు కిందపడి తీవ్రంగా గాయపడింది.

– రమేశ్, సిర్లాహిల్స్ కాలనీవాసుడు

చర్యలు తీసుకుంటాం

పోలీస్‌స్టేషన్‌కు వెళ్లే ప్రధాన రహదారిపై ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటాం. మీర్‌పేట పోలీసు అధికారులతో చర్చించి త్వరలోనే స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేస్తాం. త్వరలోనే ఈ సమస్యను ఉన్నతాధికారులతో చర్చిస్తాం.

– వేణుగోపాల్, డీఈ మీర్‌పేట కార్పొరేషన్

రోడ్ల మరమ్మతులు చేపట్టండి

ఎమ్మెల్యే సబితారెడ్డి

మహేశ్వరం: నియోజకవర్గంలో రోడ్ల నిర్మాణానికి తన వంతు కృషి చేస్తానని మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం నగరంలోని ఆమె నివాసంలో ఆర్అండ్‌బీ, పంచాయతీరాజ్ అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మహేశ్వరం, కందుకూరు మండలాల్లోని పలు గ్రామాలకు హెచ్ఏఎం(హైబ్రిడ్ యాన్యుటీ మోడల్) రోడ్స్ ప్రాజెక్టు కింద 43 కిలోమీటర్ల మేర రోడ్లను ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. హెచ్ఏఎం రోడ్స్ ప్రాజెక్టు కింద ప్రభుత్వం రహదారుల మరమ్మతులు చేయడానికి నిధులు మంజూరు చేయడంతో త్వరితగతిన పనులను ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. మహేశ్వరం మండలంలోని శ్రీశైలం జాతీయ రహదారి నుంచి తుమ్మలూరు వయా మోహబ్బత్‌నగర్, దుబ్బచర్ల నుంచి సుభాన్‌పూర్, అమీర్‌పేట్– సుభాన్‌పూర్ వయా మాణిక్యమ్మగూడ, డబిల్‌గూడ గేటు నుంచి డబిల్‌గూడ గ్రామం వరకు, హబీబుల్లాగూడ(పులిమక్త) నుంచి సంఘీగూడ వరకు, గొల్లూరు నుంచి నాగిరెడ్డిపల్లి వయా హబీబుల్లాగూడ, కోళ్లపడకల్ రోడ్డు నుంచి సుభాన్‌పూర్ వయా దిలావార్‌గూడ, నల్లచెర్వు తండా నుండి పెంచర్ల రోడ్డు వరకు మంజూరయ్యాయి.

కందుకూరులో..

కందుకూరు మండలంలోని మీర్‌ఖాన్‌పూర్ పంచాయతీరాజ్ రోడ్డు నుంచి సార్లరావులపల్లి, ముచ్చర్ల నుంచి సార్లరావులపల్లి వయా గొట్టిలగడ్డ తండా, ముచ్చర్ల రోడ్డు నుంచి సాయిరెడ్డిగూడ, కొత్తగూడ నుంచి బాచుపల్లి వయా పెరుగుగూడ, రాచులూరు నుంచి గూడురు వయా కటికపల్లి, బండమీది గూడురు వరకు మొత్తం 43 కిలోమీటర్లు మంజూరైందని ఎమ్మెల్యే తెలిపారు. దీనిపై పంచాయతీ రాజ్ డీఈ అనిల్ కుమార్‌తో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మహేశ్వరం పీఏసీఎస్ వైస్ చైర్మన్ వెంకటేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


మీర్‌పేట: అధికారులకు సూచనలు ఇస్తున్న ఎమ్మెల్యే సబితారెడ్డి

చెరువుల అభివృద్ధికి నిధుల మంజూరు

మీర్‌పేట: మీర్‌పేట, బడంగ్‌పేటలోని చెరువుల అభివృద్ధికి రూ.4 కోట్ల 60 లక్షల నిధులు మంజూరైనట్లు మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి తెలిపారు. శుక్రవారం సాయంత్రం జిల్లెలగూడ చందన చెరువును మున్సిపల్ అధికారులతో కలిసి ఎమ్మెల్యే సందర్శించి మాట్లాడారు. 2022–23 సంవత్సరంలో చెరువు అభివృద్ధి కోసం ప్రతిపాదనలు పంపగా, ఇప్పుడు చందన చెరువుకు రూ.2 కోట్ల 80 లక్షలు, బడంగ్‌పేట పెద్ద చెరువుకు రూ.1 కోటి 80 లక్షలు మంజూరయ్యాయని అన్నారు. చెరువుల వద్ద అభివృద్ధి పనులను ప్రారంభించి త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు ఆహ్లాదాన్ని అందించాలని అధికారులను ఆదేశించారు. చెరువు వద్ద దోమల బెడద లేకుండా ఎప్పటికప్పుడు ఫాగింగ్ చేపట్టాలని ఎమ్మెల్యే ఆదేశించారు. ఎమ్మెల్యే వెంట డీఈ వేణుగోపాల్, వర్క్ ఇన్‌స్పెక్టర్ అశోక్, స్థానిక నాయకులు అర్కల కామేశ్‌రెడ్డి, సిద్దాల అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

అడ్వకేట్‌ను కఠినంగా శిక్షించాలి

ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉపేందర్ మాదిగ

బడంగ్‌పేట్: సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ బీఆర్ గవాయ్‌పై దాడి యత్నం రాజ్యాంగంపై దాడే అని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాగళ్ల ఉపేందర్ మాదిగ అన్నారు. శుక్రవారం బడంగ్‌పేటలోని బాలాపూర్ మండల కార్యాలయం ఎదుట ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో జస్టిస్ గవాయ్‌పై జరిగిన దాడి యత్నానికి నిరసనగా నల్ల బ్యాడ్జీలు ధరించి ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దాడి ఘటనను సుమోటోగా స్వీకరించి నిందితులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. జస్టిస్ గవాయ్‌పై బూటు విసిరిన అడ్వకేట్ రాకేష్‌ని అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని కోరారు. అనంతరం తహసీల్దార్ ఇందిరాదేవికి వినతిపత్రం అందచేశారు. కార్యక్రమంలో నాయకులు బొర్ర రవి, సుధాకర్, నరసింహ, శేఖర్‌యాదవ్, శ్రీశైలం, కిష్టయ్య, ఉపేందర్, ఇంద్ర, అరుణ, జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.


బాలాపూర్ మండల కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న నాయకులు

రైతు చట్టాలు అమలు చేయాలి

భారతీయ కిసాన్ సంఘ్ జాతీయ కార్యవర్గ సభ్యుడు నానా అక్రేజీ

కొందుర్గు: రైతు చట్టాలను అమలు చేయాల్సిన బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఉందని భారతీయ కిసాన్ సంఘ్ జాతీయ కార్యవర్గ సభ్యుడు నానా అక్రేజీ అన్నారు. బీకేఎస్ రాష్ట్ర కోశాధికారి మాణిక్యరెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి మండలంలోని రేగడి చిల్కమర్రి గ్రామంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి నానా అక్రేజీ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. దేశంలోని 777 జిల్లాల్లో ఇప్పటివరకు 555 జిల్లాల్లో భారతీయ కిసాన్‌సంఘ్ సేవలందిస్తుందన్నారు. భారతీయ కిసాన్ సంఘ్ రాజకీయాలకతీతంగా రైతుల పక్షాన పోరాటం చేస్తుందన్నారు. రైతులందరూ సంఘటితమై పోరాడితేనే సమస్యలు తీరుతాయన్నారు.

గ్రామ కమిటీ ఏర్పాటు

ఈ సందర్భంగా రేగడిచిల్కమర్రిలో భారతీయ కిసాన్ సంఘ్ గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా వీరేశం, కార్యదర్శిగా కిరణ్‌కుమార్‌రెడ్డి, సభ్యులుగా మల్లారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, నరేందర్‌జీ, సురేష్ బాబు ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో బీకేఎస్ షాబాద్ మండలాధ్యక్షుడు యాదవ రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ నిర్ణయంపై హర్షం

కొందుర్గు: ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ఎంతో సంతోషకరమైన విషయమని కాంగ్రెస్ పార్టీ జిల్లేడ్ చౌదరిగూడ మండలాధ్యక్షుడు కావలి రాజు అన్నారు. స్థానిక ఎన్నికల్లో ముగ్గురు పిల్లల నిబంధనను ఎత్తివేయడం శుభ పరిణామమన్నారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆయన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌ను శాలువాతో సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు.

సీపీఎం నేతల ముందస్తు అరెస్టులు

కందుకూరు: బీసీ రిజర్వేషన్ల అమలు కోసం సీపీఎం చేపట్టిన చలో రాజ్‌భవన్ కార్యక్రమానికి తరలివెళ్లకుండా నాయకులను శుక్రవారం ఉదయం పోలీసులు ముందస్తుగా అరెస్టు చేసి పీఎస్‌కు తరలించారు. సీపీఎం మండల కార్యదర్శి బుట్టి బాల్‌రాజ్‌తో పాటు మండల కమిటీ సభ్యులు బుడ్డీరపు శ్రీనివాస్, అంకగళ్ల కుమార్, ఎస్ఎఫ్ఐ నాయకులను అరెస్టు చేశారు. ఈ సందర్భంగా బాల్‌రాజ్ మాట్లాడుతూ.. బీసీకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని కోరుతూ నిరసన తెలపడానికి వెళ్లకుండా అడ్డుకోవడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఓ పక్క అధికార పార్టీ బీసీ రిజర్వేషన్లను తామే అమలు చేయడానికి ప్రయత్నిస్తున్నామని చెప్పుకుంటూ ఈవిధంగా అక్రమ అరెస్టులకు పాల్పడటం బాధాకరమన్నారు. కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు బీసీలకు సహకరించాలని డిమాండ్ చేశారు. 62 శాతం ఉన్న బీసీలు తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు.


బాల్‌రాజ్‌ను అరెస్టు చేస్తున్న పోలీసులు

డ్యాన్స్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ


డ్యాన్స్‌లో పాల్గొన్న విశ్వవికాస్ స్కూల్ విద్యార్థినులు

బడంగ్‌పేట్: ఇటీవల రవీంద్రభారతిలో తెలంగాణ సీఎం డ్యాన్స్ కప్–2025 పేరుతో నేషనల్ డ్యాన్స్ ఫెస్టివల్‌ను నిర్వహించారు. రేవంతన్న మాట తెలంగాణ విద్యా అభివృద్ధికి బాట స్లోగన్‌తో స్కూల్ విద్యార్థులు డ్యాన్స్ చేశారు. దేశభక్తి, తెలంగాణ సాంస్కృతిక, సంప్రదాయ నాట్యోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ పోటీల్లో బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని బాలాపూర్‌లోని సాయినగర్ కాలనీలోని విశ్వవికాస్ హైస్కూల్ విద్యార్థినులు పాల్గొని సీఎం డ్యాన్స్ కప్‌ను కైవసం చేసుకున్నారు. నిర్వాహకుల చేతుల మీదుగా విశ్వ వికాస్ స్కూల్ నిర్వాహకులు కప్‌ను అందుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శివకుమార్‌గౌడ్, వైస్ ప్రిన్సిపాల్ శైలజ, పవిత్ర, ఉపాధ్యాయులు, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు సేవా దృక్పథంతో ఉండాలి

షాద్‌నగర్‌రూరల్: విద్యార్థులు భవిష్యత్‌లో ఉన్నత విద్యావంతులుగా ఎదిగి నవభారత నిర్మాణంలో భాగస్వాములు కావాలని ప్రిన్సిపాల్ డాక్టర్ నీతా పోలె అన్నారు. ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని కమ్మదనం గ్రామంలో గిరిజన సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ, పీజీ కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ అఫ్రోజహాన్ ఆధ్వర్యంలో గత 7 రోజులుగా ఎన్ఎస్ఎస్ వలంటీర్లు శీతాకాల ప్రత్యేక శిబిరాన్ని నిర్వహించారు. శుక్రవారం ముగింపు కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నీతాపోలె హాజరై మాట్లాడుతూ.. విద్యార్థులు విద్యార్థి దశ నుండే సేవా దృక్పథాన్ని అలవర్చుకొని సమాజాభివృద్ధిలో పాలుపంచుకోవాలన్నారు. ఎన్ఎస్ఎస్ శిబిరంలో భాగంగా వలంటీర్లు గ్రామంలో పలు అభివృద్ధి, చైతన్య కార్యక్రమాలను చేపట్టారని చెప్పారు. కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శి జగదీశ్వర్, ఎంపీటీసీ మాజీ సభ్యురాలు అరుణఅంజయ్యయగౌడ్, మాజీ ఉప సర్పంచ్ అమర్‌నాథ్ రెడ్డి, హెచ్ఎం అరుంధతి, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ కళాజ్యోతి, అధ్యాపకురాళ్లు మంతాజ్, పరమేశ్వరి, రాజేశ్వరి, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.


ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ముగింపు కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హుడాకాంప్లెక్స్: మరమ్మతుల కారణంగా శనివారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు సరూర్‌నగర్ డివిజినల్ ఇంజినీర్ ఫర్హత్ అలీ ఒక ప్రకటనలో తెలిపారు. 11కేవీ ఆటోనగర్, హైకోర్టుకాలనీ, హుడాసాయినగర్, మన్సూరాబాద్, సిరీస్ ఫీడర్, సౌత్ఎండ్‌పార్కు ఫీడర్ల పరిధిలోని కాలనీల్లో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు. 11కేవీ గణేష్‌నగర్, కొహెడ ఫీడర్ల పరిధిలోని కాలనీల్లో మధ్యాహ్నం 12 నుంచి 1 గంట వరకు. 11కేవీ గౌటేటి ఫంక్షన్‌హాల్, సాయినగర్, శివాలయం ఫీడర్ల పరిధిలోని కాలనీల్లో మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్‌ను నిలిపివేస్తున్నట్లు చెప్పారు.

శ్రీరాం కాలనీ ఫీడర్‌లో..

పహాడీషరీఫ్: జల్‌పల్లి మున్సిపాలిటీలో శ్రీరాం కాలనీ ఫీడర్‌లో మరమ్మతులు కారణంగా పలు ప్రాంతాలలో శనివారం ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని పహాడీషరీఫ్ ఏఈ ఎల్.వి.సత్యనారాయణ తెలిపారు. శ్రీరాం కాలనీ, భారతమాత లేన్, పులిగుట్ట, విజయలక్ష్మీ గార్డెన్, శ్రీరామ హిల్స్, వడ్డెర బస్తీ, రామ్ మందిర్ ప్రాంతాలలో అంతరాయం కలగడాన్ని వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

బాలాపూర్ సబ్‌స్టేషన్ పరిధి


బడంగ్‌పేట్: బాలాపూర్ సబ్‌స్టేషన్ పరిధిలోని బిస్మిల్లా కాలనీ ఫీడర్ పరిధిలో శనివారం మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ రాజు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. వాసవికాలనీ, ఆనంద్‌నగర్, కొత్తపేట, బిస్మిల్లా కాలనీ, అరాఫత్ కాలనీ, అబుబాకర్ కాలనీ విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

జనార్దన్‌రెడ్డినగర్ ఫీడర్ పరిధి

మీర్‌పేట: మరమ్మతుల కారణంగా శనివారం 11కేవీ జనార్దన్‌రెడ్డినగర్ ఫీడర్ పరిధిలోని కాలనీల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని మీర్‌పేట ఏఈ బాలాగౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. భూపేష్‌గుప్తానగర్, జనార్దన్‌రెడ్డినగర్, గాయత్రినగర్, శ్రీధర్‌కాలనీ, వెంకటేశ్వరకాలనీ, వివేక్‌నగర్, బండి సత్తయ్యకాలనీ, జిల్లెలగూడ ఓల్డ్ విలేజ్‌లలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు.

రక్తదానానికి ముందుకు రండి

శంకర్‌పల్లి: అవకాశం ఉన్న ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలని మోకిల సీఐ వీరబాబు అన్నారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం మండలంలోని ఇక్ఫాయ్ డీమ్డ్ విశ్వవిద్యాలయంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రక్తదానం చేసేందుకు విద్యార్థులు పెద్ద ఎత్తున ముందుకు వచ్చారు. సీఐ వీరబాబు మాట్లాడుతూ.. విధి నిర్వహణలో భాగంగా ఎంతో మంది పోలీసులు అమరులు అయ్యారని, వారిని స్మరిస్తూ ఏటా అక్టోబర్ 21న పోలీస్ అమరుల సంస్మరణ దినోత్సవాన్ని నిర్వహించుకుంటున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఇక్ఫాయ్ లా స్కూల్ డైరెక్టర్ తదితరులు పాల్గొన్నారు.


రక్తదానం చేస్తున్న విద్యార్థులు, చిత్రంలో సీఐ వీరబాబు

బంతి సాగు.. లాభాలు బాగు

- పండగల వేళ ఫుల్ డిమాండ్
- మెలకువలు పాటిస్తే అధిక దిగుబడులు
- చేవెళ్ల డివిజన్ ఉద్యానశాఖ అధికారి కీర్తి



షాబాద్: నీటి వసతి కలిగి ఉన్న చోట బంతి పూల సాగు అనుకూలమైంది. అతి తక్కువ పెట్టుబడితో చిన్న మెలకువలను పాటిస్తే మంచి దిగుబడులు సాధించవచ్చని ఉద్యానవన శాఖ అధికారులు సూచిస్తున్నారు. డ్రిప్ పద్ధతిని అవలంబిస్తే నీటిని కూడా పొదుపు చేయడానికి అవకాశాలున్నాయి. పండుగలు, ఇంటి గుమ్మాల అలంకరణకు, ఆలయాల్లో నిర్వహించే పూజలకు బంతి పూలకు మంచి డిమాండ్ ఉంది. తక్కువ నీటి వనరులతో పూలను సాగు చేస్తూ, సస్యరక్షణ చేపడితే ఆర్థికాదాయాన్ని సాధించవచ్చని చేవెళ్ల డివిజన్ ఉద్యాన శాఖ అధికారి కీర్తి తెలిపారు. బంతి పూల సాగుపై ఆమె సలహాలు, సూచనలు తెలియజేశారు.

విత్తుకునే సమయం

నీటి వసతి కలిగిన అన్ని కాలాలు అనుకూలం. సారవంతమైన గరప నేలలు, నీరు త్వరగా ఇంకిపోయే నేలల్లో బంతి సాగు అనుకూలంగా ఉంటుంది. బంతి మొక్కలు ఏపుగా పెరిగినప్పటికీ పూల ఉత్పత్తి మాత్రం తగ్గే అవకాశాలు ఉన్నాయి. ఆఫ్రికన్ బంతి, ఫ్రెంచ్ మేరీ గోల్డ్ రకాలున్నాయి. ఎకరానికి వెయ్యి గ్రాముల విత్తనాలు అవసరం అవుతాయి. మడులను తయారు చేసి విత్తనాలను చల్లుకోవాలి.

ఎరువుల వాడకం

ముడులను తయారు చేసే సమయంలో ఎకరానికి 20 టన్నుల బాగా చివికిన పశువుల ఎరువు వేసి కలియ దున్నుకోవాలి. దీంతో పాటు 20 నుంచి 40 కిలోల నత్రజని, 80 కిలోల భాస్వరం, 80 కిలోల పొటాష్‌ను వేసుకోవాలి. నాటిన 37 రోజులకు 20 నుంచి 40 కిలోల నత్రజనిని వేసి నీరు పెట్టుకోవాలి. విత్తిన విత్తనాలు వారం రోజుల్లో మొలకెత్తుతాయి.


మాచన్‌పల్లిలో బంతి పూల సాగు

నాటే విధానం

నెల వయసు కలిగిన బంతి మొక్కలు నాటుకోవడానికి అనుకూలంగా ఉంటుంది. నాటుకు వచ్చిన నారును సాయంత్రం వేళల్లో నాటుకోవాలి. నాటిన 60 రోజుల తర్వాత పూత దశ వచ్చేవరకు నేలలో తగినంత తేమ ఉండేలా చూసుకోవాలి. నీటి ఎద్దడితో బంతి సాగు దిగుబడులు తగ్గిపోయే ప్రమాదం ఉంది.

పూల కోత:

బంతి పూలు బాగా విచ్చుకున్న తర్వాతనే కోసుకోవాలి. కోతకు ముందు నీటి తడి ఇచ్చినట్లయితే పూలు ఎక్కువ సమయం తాజాగా వాడిపోకుండా నిలువ ఉండేందుకు వీలు ఉంటుంది. పూలను ఉదయం లేదా సాయంత్రం మాత్రమే కోయాలి. సాధారణంగా ఎకరానికి నాలుగు నుంచి ఐదు టన్నుల దిగుబడి వస్తుంది.

సస్యరక్షణ చర్యలు

పేను: పూల మొగ్గలను ఆశించి నష్ట పరుస్తాయి. వీటి నివారణకు లీటర్ నీటికి మోనోక్రొటోఫాస్ 1.5మి.లీ. కలిపి 15 రోజుల వ్యవధిలో పిచికారీ చేయాలి.

తామర పురుగులు: తామర పురుగులు ఆకులు, పూల నుంచి రసాన్ని పీల్చి నష్టపరుస్తాయి. ఆకులపై తెల్లని మచ్చలు ఏర్పడతాయి. మొగ్గలు గోధుమ రంగుకు మారి ఎండిపోతాయి. దీని నివారణకు మోనోక్రోటోపాస్ 1.5 మి.లీ. లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలి.

మొగ్గతొలిచే పురుగులు: లార్వాలు పూల మొగ్గలను తొలిచివేస్తాయి. వీటి నివారణకు ఎండోసల్ఫాన్ 2 మి.లీ. లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలి.

తెగుళ్ల నివారణ

నారుకుళ్లు తెగులు: నీటి తడి ఎక్కువగా ఉండి వేడిగా ఉన్న చోట ఈ తెగులు వ్యాపిస్తుంది. లేత మొక్కలు చనిపోతాయి. మడులను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉండే విధంగా చూడాలి. నేలను లీటర్ నీటికి 2 గ్రా. కాప్టాన్ మందుతో తడపాలి.

ఆకు మచ్చ తెగులు: మొక్కల్లో బూడిద రంగు, లేదా నల్లని మచ్చలు ఏర్పడతాయి. లీటర్ నీటికి 2.5 గ్రా. మాంకోజెబ్ కలిపి పిచికారీ చేయాలి.